క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి


అల్కామా

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి అల్కామా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించాడు. బుధవారం నగరంలోని సూరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి అల్కామా అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. దీంతో రాష్ట్ర స్థాయిలో జరిగే కరాటే పోటీలకు అర్హత సాధించాడు. కూకట్‌పల్లి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య విద్యార్థిని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

విద్యార్థులకు భోజన సౌకర్యం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లో నియోజకవర్గ నాయకులు ఏకాంత్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్‌ల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పీసీసీ చైర్మన్ గాంధీ జన్మదినం సందర్భంగా లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీను, యాదగిరి, దయాకర్‌రెడ్డి, మహేష్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగమణి, శాలిని, జితేందర్, యూత్ కాంగ్రెస్ డివిజన్ ఉపాధ్యక్షులు భాస్కర్, సోషల్ మీడియా డివిజన్ ఇన్‌చార్జి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం



కూకట్‌పల్లి: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కేపీహెచ్‌బీ, 6వ ఫేజ్‌లో సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 85 ఏళ్లు నిండిన పురుషులను, మహిళలను సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం మాజీ నిఘా అధికారి వీ. వీ. రావు ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ సిటజన్లకు ఆరోగ్య, వ్యక్తిత్వ సూచనలు చేశారు. కౌన్సిల్ అధ్యక్షులు శివశంకర్ రెడ్డి తమ కౌన్సిల్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

వికసిత్ భారత్ ప్రయోజనాలను పూర్తి స్థాయిలో పొందాలి

- పీఎఫ్ కమిషనర్ రాజేష్‌చంద్ర

మూసాపేట: వికసిత్ భారత్ ప్రయోజనాలను పూర్తి స్థాయిలో పొందాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ రాజేష్ చంద్ర అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గారి యోజన్ పథకం ప్రయోజనాలు, అర్హత, విధానాలు గురించి వివరించారు. ఉద్యోగులు, యజమానులు, పారిశ్రామిక సంఘాలు, ఇతర ఖాతాదారులకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మొదటిసారి ఉద్యోగం చేస్తున్న వారికి ప్రోత్సాహకంగా, యజమానులకు మద్దతుగా ఈ పథకం ఉంటుందన్నారు. నెలకు లక్ష వరకు జీతం పొందుతున్న ఉద్యోగులు అర్హులని, యాజమాన్యానికి నెలకు 3 వేల వరకు ప్రోత్సాహం అందుతుందని అన్నారు.

హెచ్‌సీయూలో నిరసనలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం రాత్రి నిరసన చేపట్టారు. అనంతరం ఏబీవీపీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల దిష్టిబొమ్మను దహనం చేసి వాటికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యార్థిని జేఎస్‌యూలో దాడి చేసిన కేసులో ఇప్పటివరకు ఎలాంటి పురోగతి సాధించకపోవడానికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.



భూముల వేలం సరే..
అభివృద్ధికి నిధులేవి?

- హౌసింగ్‌బోర్డు భూముల వేలంతో ఆదాయం
- స్థానిక అభివృద్ధికి నిధులు కేటాయించని వైనం
- ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని పలుమార్లు ఎమ్మెల్యే వినతి
- పట్టించుకోని బోర్డు అధికారులు


ఇటీవల హౌసింగ్ బోర్డు వేలం వేసిన రాజీవ్ సర్కిల్‌లోని ఖాళీ స్థలం

కేపీహెచ్‌బీకాలనీ: తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కూకట్‌పల్లి ప్రాంతంలోని భూములను విక్రయించడం ద్వారా వందల కోట్ల రూపాయలు వస్తున్నాయి. అయినా స్థానికంగా అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం హౌసింగ్ బోర్డు ఈ వేలం ద్వారా రాజీవ్ సర్కిల్ వద్ద గల 726 గజాల కమిర్షియల్ స్థలానికి గజం రూ.2,47, 500 రూపాయల ధర పలకడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆసియాలోనే అతి పెద్ద కాలనీగా గుర్తింపు పొందిన హౌసింగ్ బోర్డు కాలనీలో సెంటర్ పాయింట్‌గా ఇక్కడి స్థలాన్ని పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగస్టులో హౌసింగ్ బోర్డు వీసీని కలిసి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా స్థలాన్ని వేలం వేయవద్దని, ఇక్కడి స్థలంలో ఫైర్ స్టేషన్ నిర్మించాలని కూడా కోరారు. అయినా అవేమీ పట్టించుకోని అధికారులు వేలం వేసి విక్రయించారు. అత్యంత రద్దీ ప్రాంతంగా, కమర్షియల్ ప్రాంతంగా పేర్కొందిన రాజీవ్ సర్కిల్‌లో వేలం వేసిన స్థలానికి గతంతో పోల్చితే తక్కువ ధరకు అమ్ముడు పోవడం గమనార్హం. హౌసింగ్ బోర్డు అధికారులు ప్రజలకు ఉపయోగపడే కార్నర్ స్థలాలను అమ్మవద్దని కమ్యూనిటీ హాలు, సీనియర్ సిటిజన్ భవనాలు, మహిళా భవనాల కోసం కేటాయించాలని ఎమ్మెల్యే కృష్ణారావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు హౌసింగ్ బోర్డు అధికారులను కోరినా ఎలాంటి స్పందన లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వరా?

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలో రోజురోజుకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా అటు ప్రతినిధులు, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు. దీంతో పెరిగిన భూమల విలువల నేపథ్యంలో హౌసింగ్ బోర్డు సంస్థ భూములకు వేల కోట్ల రూపాయల డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే నాలుగు దఫాలుగా ఖాళీ స్థలాలను వేలం వేయడం ద్వారా వందల కోట్ల ఆదాయాన్ని హౌసింగ్ బోర్డు సమకూర్చుకుంది. ఇంకా విలువైన భూములు మిగిలి ఉన్నాయి. అయితే హౌసింగ్ బోర్డు కాలనీలో క్రీడా స్థలాలు, పార్కులు, సీనియర్ సిటిజన్ భవనాలు వంటివి హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్మించి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. తదితర ప్రాంతాల కంటే కూడా హౌసింగ్ బోర్డు కాలనీలో సదుపాయాల కల్పనలో జీహెచ్‌ఎంసీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నప్పటికీ హౌసింగ్ బోర్డు సంస్థ తన వంతుగా నిధులను వెచ్చించి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



అధ్వాన స్థితిలోకి మారిన కేపీహెచ్‌బీ కాలనీలోని కమ్యూనిటీ హాలు

> **మౌలిక వసతులు కల్పించాలి**
>
> 
>
> కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీ స్థలాలను విక్రయిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులను కేటాయించాలి. లే అవుట్‌లో 10 పర్సంట్ ఓపెన్ స్థలాల ను జీహెచ్‌ఎంసీ నిధులతో అభివృద్ధిలోకి తీసుకువస్తున్నాం. భూములను విక్రయించగా వచ్చిన నిధుల్లో కొంత భాగం హౌసింగ్ బోర్డు కూడా స్థానిక ప్రజల కోసం కేటాయించాలి. పార్కులు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించి ఇవ్వాలి.
>
> – మందడి శ్రీనివాసరావు

అధ్వానంగా కమ్యూనిటీ హాల్

హౌసింగ్ బోర్డు కాలనీ ఏర్పడిన కొత్తలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ అధ్వాన స్థితిలోకి చేరినా అధికారులు పట్టించుకోవటం లేదు. సుమారు రెండు ఎకరాల స్థలంలోని కమ్యూనిటీ హాల్‌ను కనీసం తీర్చిదిద్దేందుకు నిధులను మంజూరు చేయలేదు. కానీ వందల కోట్ల విలువైన భూములను మాత్రం అమ్ముకుని సొమ్ము చేసుకోవటం, ఇతర ప్రాంతాల్లో పథకాల అమలుకు వెచ్చించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం భూముల అమ్మకం మీద మాత్రమే దృష్టి సారించడం గమనార్హం.

> **అభివృద్ధి హౌసింగ్ బోర్డు బాధ్యత**
>
> 
>
> కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రజా అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. జీహెచ్‌ఎంసీకి తోడుగా హౌసింగ్ బోర్డు కూడా నిధులను వెచ్చించి అభివృద్ధి చేస్తే బాగుంటుంది. ఎల్ఐజీ, ఎంఐజీ గృహాల నడుమ ఉన్న చిన్న చిన్న ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.
>
> – షేక్ మహబూబ్, మూడవ ఫేజ్ వాసి

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి


గుడ్‌విల్ హోటల్ చౌరస్తాలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం ఎల్లమ్మబండలోని గుడ్‌విల్ హోటల్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. శాస్త్రవేత్తగానే కాక రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, బి. వెంకటేష్, నజీర్, షౌకత్ అలీ మున్నా, ఖాజా, గౌస్, యాజాజ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి క్లబ్

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, కాలనీ వాసులు చెన్న కేశవులు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వెంకటేష్ యాదవ్, రాజు, డేవిడ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


భరత్‌నగర్ కాలనీలో నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

సీడీఓఈ యూట్యూబ్ చానల్ ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలి ఉర్దూ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) అధికారిక యూట్యూబ్ చానల్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)–'మనూ' మధ్య ఒప్పందం కుదుర్చుకుని రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. 2 సంస్థలు తమ ఉమ్మడి లక్ష్యాలను సాధించగలవని ధీమా వ్యక్తం చేశారు. ఎన్ఐఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ అఖిలేష్‌మిశ్రా మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను విద్యాప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇస్తియాక్ అహ్మద్, సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహమద్ రజావుల్లాఖాన్, ఎన్ఐఓఎస్ కార్యదర్శి కల్నల్ షకీల్ ఆహ్మద్, సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అబ్దుల్‌సమీ సిద్ధిఖీ, డాక్టర్ షేక్ వసీం, స్టూడెంట్ సపోర్ట్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల అధికారులు

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

చందానగర్ : ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్ కలిసి కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.


చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ తదితరులు

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు


గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: పశువుల వ్యాధుల నివారణ కోసం పాడి పశువుల రైతులు తగిన జాగ్రత్తలు పాటించి టీకాలు వేయించేలా చూసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సంధ్యారాణి సూచించారు. బుధవారం డివిజన్‌లోని పశు వైద్య శాలలో గేదెలు, ఆవులలో సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు నడవలేని స్థితిలో కాళ్లల్లో పుండ్లు, నోటీలో పుండ్లు అవుతాయని, మేత మేయలేని స్థితిలో ఉంటుందన్నారు. దీంతో పాల ఉత్పత్తి తగ్గిపోయి పశువుల ఆరోగ్యం క్షీణిస్తుందని వివరించారు. వ్యాధి నివారణకు పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలని, 4 నెలలు దాటిన దూడలకు, పశువులకు ఏడాదికి రెండు సార్లు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. బుధవారం 99 అవులు, 123 గేదెలకు టీకాలు వెశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సంజీవరావు, డాక్టర్ విద్యానంద్‌గౌడ్, పశువుల గణన అధికారి రాంచంద్రం పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో మంచి ఫలితాలు

- జేఎన్‌టీయూహెచ్‌ని సందర్శించిన బీటీహెచ్ ప్రతినిధులు

బాలానగర్: స్వీడన్ దేశంలోని కార్ల్స్ క్రోనాలోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) వీసీ హెన్రిక్ జాన్సన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం జేఎన్‌టీయూహెచ్‌ని సందర్శించింది. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్–బీటీహెచ్ విద్యా సహకారంలో భాగంగా ఐడీడీఎంపీ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెన్రిక్ జాన్సన్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా రెండు యూనివర్సిటీల పరస్పర సహకారంతో మంచి ఫలితాలు పొందుతున్నాయని తెలిపారు. అనంతరం జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య విద్యా సహకారం 19 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కె. విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జీ.వి. నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న బీటీహెచ్ వీసీ హెన్రిక్ జాన్సన్, జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్ కుమార్ రెడ్డి తదితరులు

నాలుగు ప్రాంతీయ దశల్లో లోవేవ్ 25 డ్రిల్

నిజాంపేట్: భారత మహాసముద్రం వ్యాప్తంగా నిర్వహించబడుతున్న ప్రధాన సునామీ మాక్ డ్రిల్ లోవేవ్ 25లో పాల్గొంటోంది. ఈ సందర్భంగా ఇన్కయిస్ డైరెక్టర్ డా.టి.ఎం.బాలకృష్ణన్ నాయర్ మాట్లాడుతూ.. ఈ డ్రిల్ యునెస్కోకు చెందిన ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్ ఆధ్వర్యంలో ఇంటర్ గవర్నమెంటల్ కో ఆర్డినేషన్ గ్రూప్ ఫర్ ఇండియన్ ఓషన్ సునామీ వార్నింగ్ అండ్ మిటిగేషన్ సిస్టమ్ ద్వారా నిర్వహించబడుతుందన్నారు. లోవేవ్ 25 డ్రిల్ నాలుగు ప్రాంతీయ దశల్లో జరుగుతోంది. ఈ డ్రిల్ ద్వారా అత్యవసర సేవలు ప్రమాణ ఆపరేటింగ్ విధానాలను పరీక్షించటం, సునామీ వంటి పరిస్థితుల్లో ప్రతిస్పందించగల స్థాయిని అంచనా వేయటం జరుగుతుందన్నారు. 26 భారత మహాసముద్ర దేశాలకు సునామీ హెచ్చరిక బులెటిన్లు జారీ చేస్తుంది. ఈ డ్రిల్ సమయంలో జీటీఎస్, ఈమెయిల్, ఫ్యాక్స్, ఎస్ఎంఎస్, వెబ్‌సైట్ ద్వారా జాతీయ, ప్రాంతీయ స్థాయిలో సునామీ టెస్ట్ బులెటిన్లు జారీ చేయబడతాయి. భారతదేశంలో ఈ డ్రిల్‌ను ఇన్కయిస్ సమన్వయం చేస్తుందన్నారు. ఇందులో ఎన్‌డీఎంఏ, డీఎంఓఎస్, ఎన్‌డీఆర్ఎఫ్, పోర్టులు, నౌకాశ్రయాలు, ఇతర సముద్ర సంబంధిత సంస్థలు పాల్గొంటాయని తెలిపారు.

'ఐసీఈయూ' నూతన కార్యవర్గం

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరంలో 'ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్' (ఐసీఈయూ) సమావేశం జరిగింది. బుధవారం జరిగిన సమావేశంలో డివిజన్ నాయకులు మద్దిలేటి, గణేష్, రవీందర్‌లు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థగా ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసీ ఆఫ్ ఇండియా ప్రజల మన్ననలను పొందిందన్నారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అబిడ్స్‌శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం వీరే..

అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణన్, కార్యదర్శిగా నవీన్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాసులు, శ్రీకాంత్, కోశాధికారిగా శ్రావ్య, జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా వీరగోని రమేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎన్ఐసీని మరింత బలోపేతం చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించాలని కోరుతూ పలు తీర్మానాలను చేశారు.

నేడు 'మనూ' ఐటీఐలో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి గురువారం అవకాశం కల్పిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్షియా ఆజమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్లకు రెండో దశ అడ్మిషన్ కౌన్సెలింగ్ కోసం మధ్యాహ్నం 12.30 గంటల వరకు అవకాశం ఉందని దరఖాస్తులను యూనివర్శిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. కౌన్సెలింగ్‌ను మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐటీఐ క్యాంపస్‌లో మొదలవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ధ్రువీకరణ కోసం అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, కాపీలను తీసుకురావాలని సూచించారు.

క్రాకర్స్ దుకాణాలకు అనుమతి తప్పనిసరి

నిజాంపేట్: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాదారులు దుకాణాల ఏర్పాటు చేసే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, తాము సూచించే నిబంధనలు తప్పకుండా పాటించాలని మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సూచించారు. ఈ మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రాకర్స్ షాప్స్‌ని రోడ్డుపైన, ఫుట్‌పాత్‌లపైన ఏర్పాటు చేయవద్దన్నారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తామన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టడంతో పాటు అందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. బుధవారం సచివాలయం నుంచి వర్షాకాలం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్రమంత్రులు కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు రఘునందన్‌రావు, స్టీఫెన్ రవీంద్ర నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్ టైమ్ రికార్డ్ సాధించిందన్నారు. స్వతంత్ర భారతదేశంలోనే ఈ వర్షాకాలంలో అత్యధికంగా 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ధాన్యం కొనుగోలులో సరికొత్త రికార్డు, అధిక దిగుబడి, అధిక కొనుగోళ్ల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలన్నారు. సమస్యలు ఎదురైతే సత్వరమే తమతో పాటు పౌరసరఫరాల కమిషనర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లై డీఎం సుగుణబాయి, డీఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా కో– ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు వద్దు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని వెంకటరాయ నగర్‌లో మొబైల్ టవర్ ఇన్‌స్టాలేషన్‌కు అనుమతి ఇవ్వొద్దని బుధవారం పలువురు కాలనీ వాసులు కమిషనర్ సాబేర్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాంపేట్ వార్డు నంబర్ 14లోని వెంకటరాయ నగర్, రోడ్డు నంబర్ 4, ప్లాట్ నంబర్ 62లో ప్రస్తుతం ఉన్న టవర్‌ను వెంటనే తొలగించాలని అభ్యర్థించారు. అదే ఆవరణలో మరో కొత్త మొబైల్ టవర్ ఇన్‌స్టాలేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇక్కడ మొబైల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల గర్భిణులు, హార్ట్ పేషెంట్లు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మొబైల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవొద్దని కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462